నేడు తొలి ఏకాదశి పూజలు

సనత్‌నగర్: తొలి ఏకాదశి సందర్భంగా సనత్‌నగర్ శ్రీహనుమాన్ దేవాలయం ప్రాంగణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ శ్రీనివాసరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 గంటలకు సుప్రభాతసేవ, 5.30 లకు వెంకటేశ్వరస్వామి వారికి అష్టోత్తర కలశ క్షీరాభిషేకం, లక్ష తులసీ దళాలతో విశేష అర్చన, ఫల పుష్పాలంకరణ జరుగుతుందన్నారు.

గండిమైసమ్మ ఘటానికి పూజలు



ఘటానికి పూజలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాంగోపాల్‌పేట్: రెజిమెంటల్‌బజార్‌లోని గండిమైసమ్మ ఘటానికి నగర కాంగ్రెస్ ఉపాధ్యక్షులు నందికంటి రవి ఆధ్వర్యంలో పూల అలంకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి గండిమైసమ్మ అని అమ్మవారి కృప ప్రజలందరికి ఉండి సుఖశాంతులతో జీవించాలని ఆయన కోరారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాబురావు, అల్లాడి గౌరిశంకర్, నీలాంకర్, ఆనంద్, శ్రీనివాసులు, సుజన్, గోపి, సందీప్ పాల్గొన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.67, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 28, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 65, పచ్చకాకర 45, పందిరి బీర 23, క్యాబేజీ 37, క్యారెట్ 35, దొండ 35, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 85, గోకరకాయ 40, కీర 21, దోసకాయ 19, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 32, ఆలుగడ్డ 38, చామగడ్డ 35, మొరంగడ్డ 40, కందగడ్డ 50, సొరకాయ 11, పొట్లకాయ 16, అరటికాయ 11, మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

అంగన్వాడీ కేంద్రాలకు బ్లాక్ బోర్డుల అందజేత



బ్లాక్ బోర్డులు పంపిణీ చేస్తున్న డాక్టర్ లక్ష్మణ్

బౌద్ధనగర్: ప్రజా సంక్షేమానికి ప్రధాని మోదీ తలపెట్టే ప్రతీ కార్యక్రమం కిందిస్థాయి వరకు తీసుకెళ్లేందుకు స్వచ్ఛంద సంస్థలు, మహిళలు, కార్యకర్తలు ముందుకు రావాలని రాజ్యసభ ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ పేర్కొన్నారు. న్యూ అశోక్ నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం బీజేపీ నాయకురాలు మేకల కీర్తి నేతృత్వంలో బ్లాక్ బోర్డ్‌లు, పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి లక్ష్మణ్ హాజరై మాట్లాడారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే దిశగా మోదీ ప్రభుత్వం కృషి చేస్తోందని, దాన్ని స్ఫూర్తిగా తీసుకొని బౌద్ధనగర్ బీజేపీ నాయకురాలు మేకల కీర్తి అంగన్‌వాడీ కేంద్రాల్లో బ్లాక్ బోర్డులు, పుస్తకాలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. అదే విధంగా నారీ శక్తి పేరుతో మహిళలను ఆర్థికంగా పరిపుష్టి చేసేందుకు ఎన్నో పథకాలు కూడా తీసుకొచ్చినట్లు వివరించారు. రాబోయే రోజుల్లో భారత్‌ను అత్యంత అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు ప్రధాని మోదీ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, కృష్ణమూర్తి, కనకట్ల హరి, నాగేశ్వర్‌రెడడి, అంబాల రాజు, వేణు, పోచయ్య, వెంకటేష్, ప్రకాష్, అనిత, నాగరాణి, లత, శారద, మల్లేష్, గంగ, సరోజ, అనూష, ఓంప్రకాష్, సత్యనారాయణ, కొమురయ్య, లడ్డు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి



లాలాపేట: సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి ఆదేశించారు. ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లోని బస్తీల్లో మంగళవారం ఆమె పలు విభాగాల అధికారులతో కలిసి పర్యటించారు. క్యాంప్ నెంబర్ 6వ బస్తీలో పాదయాత్రగా వెళుతూ స్థానికులతో మాట్లాడారు. ప్రధానంగా రోడ్లు, పారిశుద్ధ్య, విద్యుత్, తదితర సమస్యలను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. ఆమె వెంట మెడికల్ ఆఫీసర్ రజనీకాంత్, ఇన్‌చార్జి దశరథ్, ఎంటమాలజీ ఇన్‌చార్జి రాజశేఖర్ ఉన్నారు.

ప్రతి నెలా పౌరహక్కుల దినోత్సవం నిర్వహించాలి




రాంగోపాల్‌పేట్: సమాజంలో నెలకొన్న కుల అసమానతలను రూపుమాపేందుకు ప్రతి నెలా పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన కోరారు. మంగళవారం సికింద్రాబాద్ డిప్యూటీ తహసీల్దార్ రంజనిని కలిసి వినతి పత్రం అందించారు. దళితులపై దాడులు అరికట్టేందుకు కుల వివక్ష పాటిస్తే నేరమని, కేసుల పాలవుతామని అవగాహన కల్పించాలని ఆమె తెలిపారు. డీబీఎఫ్ ఆధ్వర్యంలో తాము కూడా పౌర హక్కులపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలతో పాటు హక్కుల ఉల్లంఘన జరిగితే పోరాటాలు చేస్తామన్నారు.

శిథిలావస్థ ఇళ్లపై దృష్టి సారించాలి

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేటలో పురాతన కాలం నాటి పలు ఇళ్లు ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. అవి ఎప్పుడు కూలిపోతాయో అని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. గతంలోనే ఈ విషయమై స్థానికులు ఫిర్యాదు చేయగా జీహెచ్‌ఎంసీ అధికారులు వాటిలో కొన్నింటికి నోటీసులిచ్చి చేతులు దులుపుకున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ వర్షాకాలంలో సదరు ఇళ్లు కూలిపోయే ప్రమాదం ఉందని సంబంధిత అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

వామ్మో దోమలు!



సికింద్రాబాద్‌లో విజృంభిస్తున్న దోమలు • రోగాల బారిన జనాలు
నివారించాలంటున్న బస్తీ, కాలనీలవాసులు • విస్మరిస్తున్న అధికారులు

బస్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో దోమల బెడదతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. సాయంత్రం అయ్యిందంటే ఇళ్లలోకి దూసుకొచ్చి కంటిమీద కునుకు లేకండా చేస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారుల పర్యవేక్షణలోపం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. దోమల నివారణ విషయంలో జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ అధికారుల మాటలు కోటలు దాటుతున్నా ఆచరణ మాత్రం గడప దాటడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కానరాని పారిశుద్ధ్య చర్యలు..

ఆయా ప్రాంతాల్లో జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది చర్యలు అంతంతమాత్రంగా ఉండటంతో అపరిశుభ్రమైన వాతావరణం నెలకొంటోంది. వీధుల్లో చెత్తాచెదారం అపరిశుభ్రమైన వాతావరణం లేకుండా చూడాల్సిన వైద్య ఆరోగ్య శాఖ అధికారులుపర్యవేక్షణ లేక కిందిస్థాయి ఆ దిశగా పని చేయకపోవడంతో వ్యర్థాలు, చెత్తాచెదారం పేరుకుపోయి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. బేగంపేట్ సర్కిల్ పరిధిలోని నాలుగు డివిజన్లలోని పలు బస్తీలు, మురికివాడలు, కాలనీల్లో వేలాది మంది ప్రజలు జీవనం సాగిస్తున్నారు. పద్మారావునగర్, హమాల్‌బస్తీ, బోయిగూడ, చాచానెహ్రూ నగర్, బేగంపేట్, రాణి గంజ్, మోండా మార్కెట్, పాట్టి శ్రీరాములు నగర్, అంబేడ్కర్ నగర్, సాంబమూర్తి నగర్, విక్టోరియాగంజ్, ఆర్పీ రోడ్డు, ఓల్డ్‌గాస్‌మండి, ఐడిహెచ్ కాలనీ, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో దోమల బెడదతో ప్రజలు సతమతమవుతున్నారు. ముఖ్యంగా నాలా పక్కనున్న నివాసిత ప్రాంతాల ప్రజలు దోమల సమస్యతో తల్లడిల్లిపోతున్నారు.

రోగాల బారిన ప్రజలు..

దోమల కారణంగా అనేక మంది జ్వరం వంటి అనారోగ్య సమస్యలతో మంచం పడుతున్నారు. మలేరియా, డెంగీ, వంటి జ్వరాలకు గురవుతున్నారు. రోగం ఏదో తెలిసే లోపే ప్రజల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. రోగ క్రిములను మోసుకొచ్చే ఎనాఫిలిస్, క్యూలెక్స్, ఈడీస్, మన్‌సోనియా దోమలు ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. అనేక మంది దోమకాటుకు జ్వరంతో మంచాన పడుతున్నారు.

దోమల నివారణకు చర్యలు..

దోమల నివారణకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు సికింద్రాబాద్ జోన్ సీనియర్ ఎంటమాలజిస్ట్ దుర్గాప్రసాద్, ఏఈ శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. నిర్దిష్టమైన కార్యచరణతో ఆయా ప్రాంతాల్లో దోమల నియంత్రణ కోసం ఫాగింగ్ చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు, ప్రజాప్రతినిధుల ఫిర్యాదులు, సూచనల మేరకు ఆయా ప్రాంతాల్లో రాత్రి వేళల్లో ఫాగింగ్ చేస్తున్నామన్నారు. ప్రజల ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు స్పందిస్తున్నట్లు వారు వెల్లడించారు.

72 మంది సిబ్బంది..

జీహెచ్‌ఎంసీ బేగంపేట్ సర్కిల్ పరిధిలో దోమల నివారణ కోసం ఎంటమాలజీ విభాగం అధికారులు, సిబ్బంది తమ విధులు నిర్వహిస్తున్నారు. సుమారు 4 డివిజన్లలో సదరు సిబ్బంది దోమల నియంత్రణ, నివారణ కోసం పూర్తిస్థాయిలో పని చేయడం లేదనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ప్రతి డివిజన్‌లో 18 మంది సిబ్బంది 2 ఫాగింగ్ మిషిన్లు ఉన్నాయి. అంటే నాలుగు డివిజన్లలో 72 మంది 8 చిన్న ఫాగింగ్ మిషిన్లు కాగా మరో ఆటోట్రాలీ ఫాగింగ్ వాహనాలను ఇందు కోసం వినియోగిస్తున్నారు. సదరు వ్యవహారం మొత్తంగా కాంట్రాక్ట్ పద్ధతిలో కొనసాగుతుంది. దోమల నివారణ కోసం జీహెచ్‌ఎంసీ లక్షలాది రూపాయాలను ఖర్చు చేస్తున్నా నివారణ మాత్రం కావడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రైలు ఢీకొని ట్రాక్‌మెన్ మృతి



ప్రబంధకు ఆర్థిక సాయం అందిస్తున్న యూనియన్ నాయకులు

సికింద్రాబాద్: విధులు ముగించుకుని ఇంటికెళ్తున్న రైల్వే ఉద్యోగిని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. బీబీనగర్ మండలం గూడూరుకు చెందిన మహేందర్‌రెడ్డి (47) మౌలాలి స్టేషన్‌లో ట్రాక్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. విధులు ముగించుకుని మౌలాలి రైల్వే స్టేషన్ గూడ్స్‌క్యాబిన్ స్టోర్‌రూమ్ మీదుగా పట్టాలు దాటుతుండగా అదే సమయంలో వేగంగా దూసుకొచ్చిన రైలు ఢీ కొట్టగా తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం చేయించి మంగళవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడు మహేందర్‌రెడ్డికి భార్య ప్రబంధ, కుమారుడు ఉన్నారు.

మజ్దూర్ యూనియన్ సంతాపం

మహేందర్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించిన దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు మంగళవారం సంతాపం తెలిపారు. మహేందర్‌రెడ్డి కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థిక సహాయాన్ని యూనియన్ తరపున ప్రకటించి తక్షణ సహాయంగా రూ.50 వేల నగదును అందించారు. ఈ కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ నాయకులు చిలుకు స్వామి, నరసింహారెడ్డి, కుమారస్వామి పాల్గొన్నారు.

వర్షాలతో ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూడాలి

ఎమ్మెల్యే శ్రీగణేశ్



బోర్డు అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

కంటోన్మెంట్: వర్షాకాలంలో ప్రజలకు ఎదురయ్యే ఇబ్బందులను సత్వరమే పరిష్కరించేలా బోర్డు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే శ్రీగణేశ్ సూచించారు. మంగళవారం బోర్డు కార్యాలయంలో సీఈఓ మధుకర్ నాయక్, పలు విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కంటోన్మెంట్ చిన్నపాటి వర్షానికే జలమయమవుతున్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కంటోన్మెంట్ బోర్డు పరిధిలో స్థానిక పన్నులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అందే నిధులు, ఆయా నిధులతో చేపట్టే అభివృద్ధి పనులకు స్పష్టత ఉండాలని సూచించారు. కొన్ని ప్రాంతాల్లో ఏళ్ల తరబడి డ్రైనేజీ, తాగునీటి లైన్లు మార్చకపోవడం, రోడ్లు ధ్వంసమైనా మరమ్మతులు చేపట్టడం లేదన్నారు. కంటోన్మెంట్‌లో ఆట స్థలాలను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుముఖంగా ఉందని, ఈ మేరకు స్థలాలు కేటాయించాలని సీఈఓను కోరారు. ఈ సమావేశంలో కంటోన్మెంట్ ఇంజినీర్ (సీఈ) ఉమాశంకర్, చీఫ్ కంటోన్మెంట్ ప్లానర్ (సీసీపీ) ఫణి కుమార్, హెల్త్ సూపరింటెండెంట్ ఎం. దేవేందర్, శానిటరీ సూపరింటెండెంట్ మహేందర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని



చెక్కులను అందజేస్తున్న కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి

సనత్‌నగర్: అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ కోరారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అమీర్‌పేట మండల పరిధిలోని 29 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. పేద, మధ్య తరగతి కుటుంబాలు తమ ఇంటి ఆడపడుచు పెళ్లికి పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా ఆర్థిక సహాయం అందించేందుకు కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలను ప్రారంభించిన విషయాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, తహసీల్దార్ భీమయ్య, బీఆర్ఎస్ నాయకులు అశోక్‌యాదవ్, ప్రవీణ్‌రెడ్డి, కూతురు నర్సింహ, వెంకటేషన్ రాజు, ఏసూరి మహేష్, కుర్మ లక్ష్మీపతి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

బేగంపేట డివిజన్‌లో..

సనత్‌నగర్: పేదింటి ఆడపడుచుల పెళ్లి కోసం ఆర్థికసాయం అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం బేగంపేట డివిజన్‌కు చెందిన 14 మందికి మంజూరైన కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను మంగళవారం ఆమె అందజేసి మాట్లాడారు. సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫతేనగర్, బాలానగర్ కార్పొరేటర్లు సతీష్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, నాయకులు శ్రీహరి, సత్యనారాయణ పాల్గొన్నారు.

కంటోన్మెంట్‌కు సీఎం రేవంత్‌రెడ్డి చేసిందేమీ లేదు



సమావేశంలో మాట్లాడుతున్న బీఎన్ శ్రీనివాస్

రసూల్‌పురా: గత ఐదేళ్లుగా మల్కాజ్‌గిరి ఎంపీగా కొనసాగిన కాలంలో, ప్రస్తుతం సీఎంగా రేవంత్‌రెడ్డి కంటోన్మెంట్ నియోజకవర్గానికి చేసిందేమీ లేదని బీజేపీ మహంకాళి జిల్లా అధికార ప్రతినిధి బీఎన్. శ్రీనివాస్ ఆరోపించారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీపీసీసీ సెక్రటరీ అయూబ్‌ఖాన్, మైనార్టీ నాయకుడు జమీల్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జే. రామకృష్ణపై సోమవారం చేసిన విమర్శలను తిప్పికొట్టారు. కేంద్ర ప్రభుత్వంపై, కంటోన్మెంట్ ప్రాంతానికి మేయర్ లాంటి హోదాలో ఉన్న రామకృష్ణపై ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. ఎన్నికలు ముగిసిన ఎమ్మెల్యేగా శ్రీగణేష్ గెలిచిన తర్వాత అయూబ్ ఖాన్ కంటోన్మెంట్‌లో కనిపిస్తున్నారని ఎద్దేవా చేశారు.రామకృష్ణను విమర్శించిన నాయకులు కాంగ్రెస్ పార్టీ కంటోన్మెంట్ నియోజకవర్గానికి చేసిన అభివృద్ధిపై చర్చకు రావాలన్నారు. తాము భూకబ్జాలకు పాల్పడినట్లు నిరూపిస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటామని మీరు సిద్ధమేనా అని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో విజయానంద్, శంకర్, సతీష్, శ్రీకాంత్, మాదారపు అశోక్, అరుణ్ పాల్గొన్నారు.

ముగిసిన పీజీ ప్రవేశ పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ: పీజీ కోర్సుల ప్రవేశ పరీక్షలు మంగళవారం ముగిశాయి. రాష్ట్రంలోని 8 యూనివర్సిటీలలో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఇతర పీజీ కోర్సుల్లో 2024–25 విద్యా సంవత్సరానికి ఈ నెల 6 నుంచి ప్రారంభమైన 45 సబ్జెక్టులకు 88.31 మంది విద్యార్థులు హాజరయ్యారని ఫలితాలను ఈ నెల 30న ప్రకటించనున్నట్లు కన్వీనర్ ప్రొ.పాండురంగా రెడ్డి వివరించారు.

గ్రూప్-1 ప్రిలిమ్స్ ఫలితాల్లో రిజర్వేషన్లు పాటించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: గ్రూప్–1 ప్రిలిమ్స్ ఫలితాల్లో రిజర్వేషన్లు పాటించాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు, ఓయూ పీహెచ్‌డీ స్కాలర్ స్వామిగౌడ్ పేర్కొన్నారు. గత ప్రభుత్వం రిజర్వేషన్ల అమలుకు తీసుకొచ్చిన జీవో 55 రద్దు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త జీవో 29తో ప్రిలిమ్స్ ఫలితాల్లో రిజర్వేషన్లను రద్దు చేశారని పేర్కొన్నారు. ప్రిలిమ్స్ ఫలితాల్లో కేటగిరీల వారీగా ర్యాంకింగ్‌లు, కటాఫ్ మార్కులను పెట్టకపోవడంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, అభ్యర్థులు నష్టపోయారన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



విద్యార్థి నాయకులతో మేజర్ వర్ష

అమీర్‌పేట: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని రవీంద్రభారతి స్కూల్ మేజర్ వర్ష అన్నారు. అమీర్‌పేట ధరంకరం రోడ్డులోని పాఠశాలలో మంగళవారం 2024–25 విద్యా సంవత్సరానికి నూతనంగా ఎన్నికైన విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలను అందజేసి మాట్లాడారు. దేశ, రాజకీయ వట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీన్ ప్రియా మనీష్, ప్రిన్సిపాల్ సరిత,డీఏ మధు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఎంబీఏ విద్యార్థులకు ఉద్యోగాల పంట

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్) విద్యార్థులకు ఉద్యోగాల పంట పండింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో 17 మంది విద్యార్థులకు మేనేజర్ స్థాయి ఉద్యోగాలకు లభించాయి. సంవత్సరానికి రూ.23 లక్షల నుంచి అత్యల్పంగా రూ.8 లక్షల ప్యాకేజీతో వేతనం లభించనుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

ఘనంగా శ్రీసాయి సప్తాహ ఉత్సవాలు

పద్మారావునగర్: సికింద్రాబాద్ పద్మారావునగర్‌లోని సుప్రసిద్ధమైన శ్రీ సాయిబాబా దేవాలయంలో శ్రీ సాయి సప్తాహ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో రెండవ రోజైన మంగళవారం శ్రీ సాయి ధన్వంతరీ సేవ కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో జరిగిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు.

మాణికేశ్వర్‌నగర్‌లో అపరిశుభ్రత



మాణికేశ్వర్‌నగర్ వెళ్లే మార్గంలో ఇలా..

లాలాపేట: తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధి మాణికేశ్వర్‌నగర్‌లో చెత్త కుప్పలు పేరుకుపోయి అపరిశుభ్రత నెలకొందని బీజేపీ నాయకులు గండికోట నర్సింహా ఆగ్రహం వ్యక్తం చేశారు. వడ్డెర బస్తీకి వెళ్లే మార్గంలో ఈ ప్రాంతానికి వచ్చే వారికి చెత్త కుప్పలే స్వాగతం పలుకుతున్నట్లుగా ఉన్నాయని పేర్కొన్నారు. అసలే వర్షాకాలం చెత్త కుప్పల నుంచి దుర్వాసన, ఈగలు, దోమలు విజృంభించి రోగాల బారిన పడేస్తున్నాయన్నారు. సంబంధిత అధికారులు స్పందించి పేరుకుపోయిన వ్యర్థాలను తరలించాలని డిమాండ్ చేశారు.

బోనాల జాతర ప్రశాంతంగా జరిగేలా చర్యలు

రాంగోపాల్‌పేట్: లక్షల మంది భక్తులు పాల్గొనే సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతర ప్రశాంతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఉత్తర మండలం డీసీపీ రష్మీ పెరుమాళ్ అన్నారు. మంగళవారం మహంకాళి పోలీస్ స్టేషన్‌లో అదనపు డీసీపీ అశోక్, ఏసీపీ సర్దార్‌సింగ్, ఇన్‌స్పెక్టర్ పరశురామ్ తో కలిసి విలేకరులతో మాట్లాడారు. వీవీఐపీలు సందర్శించిన సమయంలో సాధారణ భక్తులకు ఇబ్బందులు రాకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సుమారు 10 లక్షల మందికిపైగా భక్తులు పాల్గొంటున్నందున నిమిషానికి 600 మంది అమ్మవారిని దర్శించుకోవాల్సి ఉంటుందన్నారు. బోనంతో వచ్చే మహిళల క్యూ లైన్ ఎక్కడ ఆగకుండా వేగంగా అమ్మవారిని దర్శించుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆరు ప్రత్యేక క్యూ లైన్లతో పాటు దేవాలయం వెనుక వైపు కల్యాణ మండపం నుంచి అమ్మవారిని దర్శించుకునేలా వీవీపీల కోసం కొత్తగా ప్రత్యేక క్యూలైన్ పెడుతున్నామని చెప్పారు.



మాట్లాడుతున్న డీసీపీ రష్మీ పెరుమాళ్

పెండింగ్ పనులను పూర్తి చేయాలి



కుమ్మరి బస్తీలో పర్యటించిన కార్పొరేటర్ సరళ

అమీర్‌పేట: అమీర్‌పేట కుమ్మరి బస్తీలో అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ పైప్ పనులను త్వరగా పూర్తి చేయాలని కార్పొరేటర్ సరళ అధికారులకు సూచించారు. స్థానిక ప్రజల ఫిర్యాదు మేరకు మంగళవారం ఆమె బస్తీలో పర్యటించారు. మ్యాన్‌హోళ్ల వద్ద ఏర్పడ్డ గుంతల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని జలమండలి అధికారులకు సూచించారు. ఆమె వెంట శివకుమార్, శ్రీశైలం గౌడ్, లక్ష్మణ్‌రావు, భిక్షపతిగౌడ్, రాకేష్ గౌడ్, పవన్, రమేష్ పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379